
ఈ వారం కథ

# థాంక్యూ అన్నయ్యా!

- వడ్లమూడి దుర్గాంబ



అప్పటికి అది పదోసారి భారతి ఇంట్లోకీ, బయటకీ తిరగడం. ఇంట్లోకి వెళ్ళిన ప్రతిసారీ అలారం వైపూ-మంచంలో మూలుగుతున్న తమ్ముడి వంటిపై చేయి వేసీ చూస్తూనే వుంది. టైమ్ ఒక్కొక్క సెకన్ పెరుగుతోంది. తమ్ముడి వంటి టెంపరేచర్ మాత్రం విపరీతంగా పెరిగిపోతున్నట్టనిపించింది.

తమ్ముడి మంచం పక్కనే కూర్చున్న తల్లి మొహంలోకి చూసింది. అద్దంలో చూసుకున్నట్టుగా తనలోని కంగారు, ఆదుర్దా, భయం, బాధా- ఈ భావాలన్నీ తల్లి మొహంలో కనబడుతున్నాయి.

మళ్ళీ ఓసారి బయటికి వెళ్ళి వచ్చి టైమ్ చూసింది. పదిన్నర! అమావాస్య. అవడం వల్ల చిమ్మ చీకటిగా వుంది బయట. ఆ వీధిలో లైట్లు అన్నీ వెలగడం లేదు. ఒకటి మాత్రం రోడ్డు చివర వెలుగుతోంది. అదీ వెలిగీ ఆరిపోతోంది-భారతి మనసులో ఆశలా!

అది వెలిగినప్పుడల్లా ఆమె ఆశగా, ఆత్రంగా చూస్తోంది. సైకిల్ కనబడుతుందేమో-సైకిల్‌పై అన్న కనబడతాడేమో అని.

ఈసారి భారతి లోపలికెళ్ళేసరికి వాళ్ళమ్మ బాధ కరిగి నీరవడం మొదలుపెట్టింది. కళ్ళు తుడుచుకుంటోంది కమల. "వీడికేమైనా బుద్ధుందా! నాన్నకి నైట్ డ్యూటీ అని తెలుసుకదా! తమ్ముడికి పొద్దుట్నించి జ్వరమనీ తెలుసు! ఈ ఒక్క రోజన్నా తిరుగుళ్ళు ఆపి ఇంటి పట్టున వుండొచ్చు కదా! ఈ చీకట్లో అర్ధరాత్రి మనమేం చేయగలం. ఆ హాస్పిటల్ దగ్గర్లో కూడా లేదు. అంతా నా ఖర్మ!" ఆమె మనసులోని బాధని బయటికి పంపడానికి కళ్ళకి శక్తి చాల్లేదు. అందుకే నోటిద్వారా ఆవేదన బయట పడుతోంది.

"మధ్యాహ్నం తగ్గింది కదమ్మా, అందుకే అన్నయ్య అశ్రద్ధ చేశాడు. వాడికేం తెలుసు. మళ్ళీ ఇలా తిరగబెడుతుందనీ..." తల్లిని సమాధానపరుస్తూనే - "పోనీ అమ్మా! మనిద్దరం తీసికెల్దామా..." అడిగింది భారతి.

"ఎలా వెళ్ళగలమే ఈ చీకట్లో. ఈ చీకట్లో రిక్షా ఎక్కడ దొరుకుతుంది. వాడైతే సైకిల్ మీద తీసికెళ్ళగలుగుతాడు" కొడుకు నుదుటి మీద చేయి వేసి తల రుద్దుతూ అందామె.

మరో అయిదు నిముషాలు చూసి ఓ నిర్ణయానికొచ్చిన దానిలా "అమ్మా అన్నయ్య శ్రీదేవి బార్ ముందువుంటాడు నే వెళ్ళి పిల్చుకొస్తా" అంది భారతి. ఉలిక్కిపడి చూసింది కమల. "అమ్మో! ఇంకా నయం! మతేమన్నా పోయిందా నీకు. ఇంత రాత్రివేళ ఒక్కదానివే వెళ్తావా! మీ నాన్నకి తెలిస్తే కోప్పడతారు. అన్నయ్య అసలు ఊరుకోడు.." ఆమె చెబుతూనే వుంది. కానీ భారతి వినదల్చుకోలేదు.

"ఏం అనరులే! ఇప్పటికే ఆలస్యమయింది. నాకేం భయం లేదు. ఒక్క నిముషంలో అన్నయ్యని తీసుకుని వచ్చేస్తా" చెప్పలేసుకుని పరుగులాంటి నడకతో బయల్దేరింది. తన ధైర్యానికి తనకే ఆశ్చర్యమేసింది భారతికి. పట్టపగలే ఒక్కతే ఎక్కడికీ వెళ్ళదు ఆమె. 'వెళ్ళదు' కాదు ఇంట్లో వాళ్ళు వెళ్ళనీయరు.

చిత్రంగా - జ్వరంతో పడుకున్న తమ్ముడు మనసులో మెదులుతుంటే ఆమెకి ఏ మాత్రం భయం అనిపించడం లేదు. భయం కంటే బాధ గొప్పది! భయంతో నిండిన మనసు ముడుచుకుపోతుంది. ఏ పనీ చేయలేని అశక్తు

రాలై పోతుంది. అదే బాధతో నిండిన హృదయాన్ని ఒక రకమైన వైరాగ్యం ఆవహిస్తుంది. దాన్నుండి ఒక విధమైన తెగువ, తెగింపు వుడతాయి. అందుకే భారతికి ఆ సమయంలో జ్వరంతో వున్న తమ్ముడు తప్ప మరేమీ కనిపించడం లేదు.

అన్న వుంటాడు అనుకున్న రోడ్డు మీదకి వచ్చేసాక ఆమె ఆత్రంగా నిశితంగా రోడ్డు చివరికి చూసింది. తనూహించింది నిజమే! శ్రీదేవిబార్ ముందు వున్న అయిదారుగురు కుర్రాళ్ళలో తన అన్న కుమార్‌ని తేలిగ్గా గుర్తించగలిగిందామె. అతను అక్కడ దొరుకుతాడన్న ఆలోచన వచ్చినందుకు అంత బాధలోనూ కించిత్తు ఆనందమనిపించింది.

తండ్రి చాలాసార్లు అంటూంటే – అంటూంటే కాదు తిడుతూంటే వింది తను "వీడికి చదువూ సంధ్యా లేదు – కనీసం ఏదన్నా పనన్నా చూసుకో వచ్చుగా– అలా ఆ బార్ ముందు నిలబడి వెకిలి వేషాలు వేయకపోతే – వాళ్ళంతా వున్నవాళ్ళ పిల్లలు! వాళ్ళతో కలసి ఏదన్నా గొడవల్లో ఇరుక్కుంటే కాపాడే శక్తి మాత్రం నాకు లేదు. చెప్ప వాడికి" భార్యకి చెబుతాడాయన. ఆమె విని ఊరుకుంటుంది. నిర్లక్ష్యం కాదు! కొడుకు తన మాటలు లెక్క చేయడన్న గట్టి నమ్మకం!

ఆలోచనల్లోంచి తెప్పరిల్లి మరింత స్పష్టంగా కనబడుతున్న అన్నను చూసింది. అతని ఫ్రెండ్స్ అంతా ఎందుకో గట్టిగా నవ్వుతున్నారు. ఆమె సరాసరి వాళ్ళ దగ్గరగా వెళ్ళేసరికి ఒక్కసారిగా అక్కడంతా నిశ్శబ్దం ఆవరించింది. వాళ్ళ మొహాల్లో విపరీతమైన ఆశ్చర్యం కనబడుతోంది.

అన్న మోహంలోకి చూసింది భారతి. అతని మొహం ఎర్రగా కంది పోయి వుంది. ఆ మసక కాంతిలోనే – అలవాటైన అతని ముఖ కవళికలను బట్టి అతను చాలా కోపంగా వున్నాడని అర్థమైంది ఆమెకి.

"అన్నయ్యా!" గబగబా చెప్పేయబోయింది. ఆమె ఆ మాటందో లేదో – "సారీరా కుమార్! మీ చెల్లాయని మాకేం తెలుసు..." ఒకడన్నాడు. అతని గొంతులో పెద్ద పశ్చాత్తాపం ఏమీ లేదు. పొరబాటున మన ప్రక్క వ్యక్తికి మన చేయి చిటికెన వేలు తగిలితే – సారీ చెప్పేటప్పుడు మన గొంతులో వినిపించే ఈజీనెస్‌వుంది.

భారతికి ఏదో నిదానంగా అర్థమవుతున్నట్టుగా వుంది. కానీ అర్థమవుతున్న దాన్ని మరింత విడమరిచి – పరిశీలించే స్థితిలో లేదామె. కుమార్ పక్కనే స్టాండ్ వేసి వున్న సైకిల్ తీసుకు వచ్చాడు. అన్న వెనకాలే నడుస్తూ – తమ్ముడి జ్వరం గురించి గబగబా చెప్పేసి – తనని కూడా సైకిలెక్కించుకుని. త్వరగా ఇంటికి తీసికెళ్తాడని ఆశగా చూసింది భారతి.

అతను ఏం మాట్లాడలేదు. ఆమె అంతా చెప్పాక కూడా అతను సైకిల్ నడిపించుకుంటూనే ఇల్లు చేరాడు భారతితో కలసి.

ఇంటికి వెళ్ళగానే కుమార్ చేసిన పని తమ్ముడి ఒంటిపై చేయి వేసి చూడటం కాదు. ఆ చేయి భారతి చెంపపై పడింది. బలంగా ఈడ్చి కొట్టాడు. నివ్వెర పోయిందామె!

అసలే బాధతో సగం అయోమయ స్థితిలో వున్న భారతి పూర్తిగా అయోమయంలో పడిపోయింది. కొడుకు చేసిన పని చూసిన కమలకి నోట వెంట మాట రాలేదు. "సిగ్గులేదు – అర్ధరాత్రి పూట రోడ్డమ్మట ఒక్కదానివే వస్తావా! పైగా నలుగురి మగాళ్ళ మధ్య నిలబడ్డ నన్ను పిలుస్తావా!"

తమ్ముడి ఒంటి టెంపరేచర్ కంటే అన్న మాటల్లో వేడి ఎక్కువగా కనిపించింది భారతికి.ఆమెకి వెంటనే ఏం మాట్లాడాలో తోచలేదు. అది అంతే! తప్పుచేసిన వాడు తనకు పడిన శిక్షకు వెంటనే రియాక్ట్ కాగలడు. ఎందుకంటే – చేసిన తప్పుకు శిక్ష ముందు నుండే ఊహిస్తుంటాడు కాబట్టి కానీ ఏ తప్పూ చేయని వారికి కనీసం ఆ ఆలోచన కూడా వుండదు కాబట్టి కాసేపటి వరకూ ఈ లోకంలోకి రాలేరు. భారతి పరిస్థితి అలాగే వుంది.

"దాన్నెందుకు అంటావురా! తమ్ముడ్నిలా చూసేసరికి ఏం చేయాలో తెలియక..." "నువ్వూరుకో అమ్మా" తల్లిని ఒక్క కసరు కసిరాడు కుమార్. "ఆడపిల్లల్ని గురించి బయట ఎంత చీప్‌గా కామెంట్ చేసేవాళ్ళున్నారో మీకేం తెలుసు! నేనా చీకట్లో సరిగ్గా చూసి ఇది నా చెల్లెలని చెప్పేలోపలే – ఆ వెధవలు ఎన్నెన్ని మాటలన్నారో తెలుసా! నా రక్తం ఉడికిపోతోంది.." తెలుసా! అని ఆగిపోయాడు కుమార్!

ఆ మాటలేమై వుంటాయో – ఈ పవిత్ర భారతదేశంలో పుట్టిన భారతికి తెలుసు! కుమార్ వంటి కొడుకుని కన్న కమలకీ తెలుసు! తెల్లారి లేస్తే సభ్య సమాజంలో జీవిస్తూనే వున్నారు కదా! మీకూ తెలుసు! అందరికీ తెలిసిన విషయం గురించి మళ్ళీ రాయడం అనవసరం!

భారతికి ఒళ్ళు జలదరించింది. ఇంకా అన్న తమ్ముడి వైపు చూడనైనా లేదు. తనని తిట్టడంలోనే నిమగ్నమై వున్నాడు. అతడి తిట్లద్వారా ఆమెకో విషయం స్పష్టంగా తెలిసింది. అతని మాటల్లో తన స్నేహితుల్ని ఏ మాత్రం తప్పు పట్టడం లేదు. తప్పంతా చెల్లెలిదే అన్నట్టు మాట్లాడుతున్నాడు. తన స్నేహితులు చేసిన పని చాలా సహజం అయినట్టు – గాలి పీల్చడం – అన్నం తినడంలా. కానీ చెల్లెలు చేసిన పనే ఏదో సృష్టికే విరుద్ధమైనట్టు!

భారతికి ఆ నిజం జీర్ణం చేసుకోవడం చాలా కష్టంగా వుంది. అడవిలోంచి పొరబాటున ఓ పులి తప్పించుకుని ఊర్లోకి వచ్చేసింది! ప్రభుత్వ బాధ్యత – పోనీ – ప్రజల బాధ్యత ఏమిటి? దాన్ని బంధించి – మరలా తాము స్వేచ్ఛగా తిరగడం! అంతే గానీ – పులి కూడా మనతోపాటే వుంటుంది. మీరు దాని కళ్ళబడకుండా మీ పనులు చేసుకోండి– అంటే ఎలా వుంటుంది! ఇప్పుడు భారతి పని అలాగే వుంది.

ఆమెకి హఠాత్తుగా తనీ మధ్య ఎక్కడో చదివిన ఓ కొటేషన్ గుర్తొచ్చింది. 'ఓడలు హార్బర్‌లోనే వుంటే ఎలాంటి ప్రమాదాలకి లోనుకాకుండా క్షేమంగా వుంటాయి. కానీ వాటిని తయారు చేసింది అలా హార్బర్‌లోనే వుంచడానికి కాదు కదా!' స్త్రీ పరిస్థితి కూడా అంతేనా! బయటికి వెళ్ళకుండా – స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించకుండా వుంటే స్త్రీ సమాజంలో క్షేమంగా వుంటుంది. కానీ ఈ భూమ్మీద స్త్రీ జన్మించింది అలా వుండటానికేనా!

హార్బర్‌లోనే వుండిపోయే ఓడలకి – ఇంట్లోంచి బయటికి కదలకుండా క్షేమంగా వున్నాం అని ఆనందించే స్త్రీలకీ తేడా ఏముంది?

తల్లినీ, చెల్లినీ, చివరికి జ్వరంతో వున్న తమ్ముణ్ణి కూడా పట్టించుకోకుండా తిడుతూనే వున్నాడు కుమార్. మరొకరు అవమానించినప్పుడే మనమున్న నీచమైన పరిస్థితి ఎలాంటిదో గుర్తించగలుగుతాం! అటువంటప్పుడు మనని అవమాన పరిచిన వారికి మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

భారతి ఇప్పుడు అదే పని చేసింది. అతను కొట్టిన చెంపను చేత్తో రాసుకుంటూ "థాంక్స్ అన్నయ్యా!" అని– తల్లి వైపు తిరిగి "అమ్మా! ఇందాక బైటకెళ్ళినప్పుడు చూశాను బార్ దగ్గర రిక్షాలున్నాయి. పిల్చుకొస్తాను. తమ్ముణ్ణి ఆస్పత్రికి తీసుకెళ్దాం" వెనక్కి తిరిగి చూడకుండా ఇంట్లోంచి అడుగు బయట పెట్టిందామె. ■

## స్వదేశీ తొలి పుస్తకం

భారతీయ భాషలలో మొట్టమొదటిగా తమిళ భాషలో పుస్తకం అచ్చు అయింది. తమిళ అక్షరాలు టైపు ఫాండ్రీలోనే తయారు చేసుకుని ఆ అక్షరాల ద్వారా కూర్చబడిన తొలి స్వదేశీ పుస్తకం 1713వ సంవత్సరంలో విడుదల చేయటం జరిగింది. దీని పేరు "మనో మంజరి థాళ్."

– పి.వి. రమణకుమార్